# ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తాం

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మఠంపల్లి: సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చింతలపాలెం, మే 21: రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంజనీ పరిశ్రమ ఆడిటోరియంలో మండలంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పనుల పురోగతిపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఇరిగేషన్ అధికారులతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.37.70 కోట్లు మంజూరు చేయించామని, దీంతో నక్కగూడెం, చింత్రియాల, కిష్టాపురం, తమ్మవరం గ్రామాల రైతులకు చెందిన 3,200 ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. అదే విధంగా ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ఇందిరాగాంధీ ఎత్తిపోతల పథకం అని నామకరణం చేశామని, దీని ద్వారా మఠంపల్లి, మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లోని 53 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ లిఫ్టును 2026 ఆగస్ట్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్‌ను రూ.394 కోట్లతో చేపట్టనున్నట్లు చెప్పారు. తద్వారా మేళ్లచెర్వు, చింతలపాలెం, హుజూర్‌నగర్, చిలుకూరు, కోదాడ మండలాల పరిధిలోని 12 గ్రామాల రైతులకు చెందిన 14,100 ఎకరాలకు సాగు నీరు అందుతుందని వెల్లడించారు. దీనిని వచ్చే ఏడాది మే నెల నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ సీఈ రమేశ్‌బాబు, ఎస్‌ఈ శివధర్మతేజ, డీఈలు చారి, హరికిశోర్, తాసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సబ్ స్టేషన్ ప్రారంభం

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను కలెక్టర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎస్ఈ ఫ్రాంక్లిన్, డీఈ వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో తిరంగా ర్యాలీ



నేరేడుచర్లలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నేరేడుచర్ల, మే 21: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నేరేడుచర్లలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాలు చేతబూని పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీలతారెడ్డి, కొణతం సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, కొణతం నాగిరెడ్డి, దూళిపాళ ధనుంజయనాయుడు, పేరబోయిన వీరయ్య, కొత్తా లక్ష్మణ్, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లూరి రమేష్, జింకల భాస్కర్, యారవ సురేష్, యడవల్లి సత్యనారాయణరెడ్డి, కాలం నాగయ్య, సరికొప్పుల నాగేశ్వరరావు, రాచకొండ శేఖర్, పార్ధనబోయిన విజయ్, అశోక్, నటరాజ్, జగతయ్య, లచ్చిరెడ్డి, శ్రీను, ఆంజనేయులు, శివయ్య పాల్గొన్నారు.

# వాహనాల వేలం వాయిదా : సీఐ రజిత

తుంగతుర్తి, మే 21: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించాల్సి ఉన్న వాహనాల వేలం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే మరో తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

● ఎంఈఓ గోపాలరావు



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ గోపాలరావు

మోతె, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు ముంతా శ్రీనివాస్, ఆర్.నాగయ్య, చెరువు సింహాద్రి, ధరావతు లాలు, వీరస్వామి, బ్రహ్మచారి, సాయిశ్యామ్, శంకర్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మందులతో క్షయ వ్యాధి నివారణ

● మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్

హుజూర్‌నగర్ రూరల్, మే 21: మందులను క్రమం తప్పకుండా వాడితే క్షయ వ్యాధిని నివారించొచ్చని మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్ తెలిపారు. మండల పరిధిలోని లక్కవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రక్తం జీరలు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలని, తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉందని, కాబట్టి తక్షణమే సమీప ఆశ వర్కర్లకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, ఎల్‌టీ రమేశ్, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, ఉద్దగిరి శ్రీనివాస్, వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు శారద, హర్షకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# 'వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి'

చిట్యాల, మే 21: ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారుల్లో ఆలోచించే దృక్పథాన్ని, పరిసరాలను వినియోగించుకునే విధంగా బోధన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి, ఎంఈఓ పి.సైదానాయక్, రిసోర్స్ పర్సన్స్ కరుణాకర్, అశోక్‌రెడ్డి, అంజయ్య, రెహానా కౌసర్, కిరణ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

తిప్పర్తి, మే 21: తిప్పర్తి పీఏసీఎస్ కార్యాలయంలో, ఆగ్రో రైతు సేవా కేంద్రంలో జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సన్నిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 30 కేజీల ధర రూ.2137.50, జనుము 40 కేజీల ధర రూ.2,510 ఉన్నట్లు చెప్పారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు



అర్వపల్లిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అర్వపల్లి, మే 21: వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని అర్వపల్లి, రామన్నగూడెం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లారీలను ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నామని, హమాలీల కొరత లేకుండా చూసుకొని వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని చెప్పారు. అదేవిధంగా రైతులు సొంత ట్రాక్టర్ల ద్వారా కానీ కిరాయి ట్రాక్టర్ల ద్వారా కానీ ధాన్యాన్ని రవాణా చేసుకోవచ్చని, ట్రాక్టర్ కిరాయి టన్నుకు రూ.300 చొప్పున ప్రభుత్వం అందిస్తున్నది తెలిపారు. రైతులు సహకరించి ధాన్యాన్ని తొందరగా మిల్లులకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి, ఆర్ఐలు జలందర్‌రావు, వెంకటరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# దంచి కొట్టిన వాన

● ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

● పిడుగుపాటుకు పలుచోట్ల గొర్రెలు, మేకలు మృత్యువాత



సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో నిలిచిన వాన నీరు



అనంతారం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

సూర్యాపేట టౌన్, మే 21: సూర్యాపేట జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అప్పటి వరకు ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా కురిసిన వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది. సుమారు గంట పాటు వర్షం కురవడంతో రోడ్లపై పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. పలుచోట్ల పిడుగులు పడి గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. జిల్లా కేంద్రంలోని 8వ వార్డు సీతరాంపురానికి చెందిన మేడుదుల మల్లయ్యకు చెందిన గొర్రెలను నల్ల చెరువు తండాలో మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

### కోదాడ మండలంలో 36 మేకలు మృతి

కోదాడ రూరల్: మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన బడుగుల లక్ష్మయ్య కుటుంబానికి మేకల పెంపకం జీవనాధారం. లక్ష్మయ్య ప్రతిరోజు గ్రామ శివారులో మేకలు మేపుతుంటాడు. రెండు రోజులుగా జ్వరం వస్తుండడంతో మేకలను కాసేందుకు గ్రామానికి చెందిన లింగయ్యను కూలి కింద పంపించాడు. లింగయ్య బుధవారం నల్లబండగూడెం గ్రామ శివారులోని మంగలితండా రోడ్డులోని రైస్ మిల్లు ఎదురుగా ఓ పొలంలో మేకలను మేపుతుండగా వర్షం రావడంతో మేకలు మొత్తం సమీపంలోని చెట్టు కిందకు చేరాయి. కాపరి లింగయ్య దూరంగా ఓ బండపై నిల్చొని ఉన్నాడు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా పిడుగు పడటంతో చెట్టు కింద 36 మేకలు మృత్యువాత పడ్డాయి. చెట్టుకు దూరంగా ఉండటంతో లింగయ్యకు ప్రాణపాయం తప్పింది. ఈ ఏడాది మేకలను అమ్మి కుమార్తె వివాహం చేయాలనుకుంటున్న సమయంలో మేకలు మృత్యువాత పడటంతో లక్ష్మయ్య బోరున విలపించాడు. సెంటు భూమి కూడా లేని లక్ష్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, మండల పశువైద్యాధికారి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

### తడిసిన ధాన్యం

పెన్‌పహాడ్: అకాల వర్షానికి అనంతారం గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో అమ్మకానికి తెచ్చిన దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం, 50 ధాన్యపు రాశులు తడిసిపోయాయి.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని పలు గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో వడ్ల రాశులతో పాటు గోనె సంచుల్లో నింపిన ధాన్యం తడిసిపోయింది.

తుంగతుర్తి: మండల వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

### బూరుగడ్డలో పిడుగుపాటు

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో మాడుగుల రాములమ్మ ఇంటి మెట్లపైన వాస్తు కోసం కట్టిన దిమ్మెపై పిడుగుపడి ధ్వంసమైంది. అదేవిధంగా ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి.

### విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి

మేళ్లచెర్వు: మండలంలోని రేవూరు శివారులో గాలికి తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి.

# సూర్యాపేట డీఎస్పీగా ప్రసన్నకుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేట టౌన్, మే 21: సూర్యాపేట డీఎస్పీగా ప్రసన్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. బెట్టింగ్, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దని ప్రజలకు సూచించారు. యువత చెడు వ్యసనాల బారినపడి తప్పుడు మార్గంలో పయనించొద్దని, కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కృష్ణా నదిలో పడి వ్యక్తి మృతి

చింతలపాలెం, మే 21: మండలంలోని చింత్రియాల గ్రామానికి చెందిన బంగారు పార్వతీశం (42) ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో పడి మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీశం మంగళవారం గేదెలను తోలుకొని పాత కిష్టాపురం గ్రామ సమీపంలో గల కృష్ణా నది వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ గేదె నదిలోకి దిగడంతో దానిని బయటకు తీసుకురావడానికి తాను కూడా నదిలోకి దిగాడు. ఈ క్రమంలోనే నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో పార్వతీశం మృతదేహం లభ్యమైంది. పార్వతీశానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పార్వతీశం భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

సూర్యాపేట టౌన్, మే 21: ఆత్మకూర్.ఎస్ మండలం ఇస్తాళాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 1983–84 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నాటి విద్యార్థులు తమ కుటుంబాలతో సహా హాజరయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత మార్గంలో పయనించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రామనాథం, అప్పారావు, నారాయణ, బాబురావు, పుల్లయ్య, పూర్వ విద్యార్థులు గండమల్ల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తూడి శంకర్‌రావు, నీలమ్మ, కిశోర్, తావుర్యా, నిర్మల, మానుపురి శ్రీనివాస్, ఇరుగు బాబు, కంచర్ల వెంకట్‌రెడ్డి, మన్సూర్‌అలీ, రావుల శ్రీను, వెంకన్న, వనమ్మ, కళావతి, శ్యామల, వసంత, లలిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిలుకూరు, మే 21: విద్యుదాఘాతంతో వ్యక్తి మరణించిన ఘటన చిలుకూరు మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు రెమిడాల వెంకటి (54) దండెంపై ఉన్న బట్టలు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. వెంకటి భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాంబాబుగౌడ్ తెలిపారు. వెంకటికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

# గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

రామగిరి, మే 21: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నల్లగొండకు చెందిన కంచర్ల సుగుణ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రూ.75 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, గడ్డం నరేశ్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది నరసింహారెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మఠంపల్లి, మే 21: మఠంపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని బిల్యానాయక్‌తండా, పెదవీడు, మట్టపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ హరీశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మోతె, మే 21: మండలంలోని రాఘవాపురం గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుశర్ల శివయ్య అనే కల్లుగీత కార్మికుడు బుధవారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తక్షణమే ఆయనను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 'అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి'

నూతనకల్, మే 21: అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు, ఇండ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొందరికే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, మిగతా పేదవారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వెంకటరెడ్డి, శ్రీరాములు, వీరన్న, మల్లయ్య, నాగన్న, రవి, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీకి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పరామర్శ

మునగాల, మే 21: మునగాల మాజీ ఎంపీపీ, సీపీఎం అనుబంధ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు భార్య కుమారి అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం కుమారి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాములను పరామర్శించారు. కార్యక్రమంలో జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర నాయకురాలు మల్లు లక్ష్మి, వీరారెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, జహంగీర్, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు

● మాజీ జడ్పీటీసీ సైదిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, మే 21: రాజకీయ కక్షలో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందాయని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను నెరవేర్చలేక, ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచులు అన్నెం శిరీషాకొండారెడ్డి, గుజ్జుల సుజాతఅంజిరెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను వేధిస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, మే 21: కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వేధింపులకు గురి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. తప్పుడు నోటీసులతో వేధింపులకు గురి చేస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తుంగతుర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. అతి తక్కువ కాలంలో దేశంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గోదావరి నదిపై నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని, అది జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొంకూరి మల్లేశ్, బొజ్జ సాయికిరణ్, గోపగాని వెంకన్న పాల్గొన్నారు.

# 'సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి, మే 21: మండలంలోని వర్ధాపురం గ్రామంలో ఈ నెల 25వ తేదీన జరుగనున్న సీపీఐ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మాజీ ఎంపీటీసీ లాల్యానాయక్, నాయకులు దాశరథి రామకృష్ణ, అమరారపు వెంకటయ్య, కొండారెడ్డి, నాగేశ్వరరావు, జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

కోదాడ రూరల్, మే 21: పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన విద్యార్థులను గ్రామానికి చెందిన అన్నం నరసింహారెడ్డి, స్రవంతి దంపతులు బుధవారం సన్మానించారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులోనూ చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరబాబు, జ్యోతిరాణి, కన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, సుభాశ్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, అంజిరెడ్డి, పాపిరెడ్డి, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

# జలగం జనార్దన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

● మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



సూర్యాపేట టౌన్: జనార్దన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సూర్యాపేట టౌన్, మే 21: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కామ్రేడ్ జలగం జనార్దన్ స్ఫూర్తితో పోరాడుతామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. నల్లగొండ జిల్లా విప్లవోద్యమ నాయకుడు జలగం జనార్దన్ (జెన్ను) 4వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రం పరిధిలోని చంద్ర పుల్లారెడ్డి నగర్‌లో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ జనార్దన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా విప్లవ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అలుపెరగని పోరాటాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపూరులో..

ఆత్మకూర్.ఎస్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఏపూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ జలగం జనార్దన్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యుడు కంచనపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ జి.ఝాన్సీ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, అలుగుల్లి వెంకట్‌రెడ్డి, కళమ్మ, సుదగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**ST FRANCIS COLLEGE OF EDUCATION**
Recognised by NCTE & Affiliated to MGU
GANDHI NAGAR, JANAGON ROAD, SURYAPET-508213, DIST.SURYAPET

**WANTED PRINCIPAL**

| Post | No of Vacancies | Qualifications |
|---|---|---|
| Principal | 1 | Ph.D., in Education or in the discipline relevant to the area of specialization and M.A.,/M.Sc., with M.Ed., 55% marks Min.8 Years Professional Experience in Teacher Education |

Qualified Candidates may send their resumes by mail or post on or before 30th May 2025.
**Sd/- Secretary/Correspondent**
Cell: 9666066514, Email:prabhakar.sooram@gmail.com